క్లుప్తంగా

జగన్ పాలనలో యానాదులకు పూర్తి న్యాయం



వైఎస్సార్ సీపీకి మద్దతుగా ప్రచారం చేస్తున్న మేకల ఏడుకొండలు

తాళ్లపూడి: జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో యానాదులకు పూర్తి న్యాయం జరిగిందని ఆంధ్రప్రదేశ్ యానాది (గిరిజన) సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మేకల ఏడుకొండలు అన్నారు. తాళ్లపూడిలోని యానాదుల కాలనీలో శనివారం ఆయన యానాదులతో సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ తరపున ఎన్నికల ప్రచారం చేశారు. ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలన్నారు. ఈ ప్రభుత్వంలో యానాదులకు అమ్మఒడి, విద్యా దీవెన, వైఎస్సార్ ఆసరా, ఇంటి స్థలాలు అందజేశారన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైఎస్సార్ సీపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు, రాజమహేంద్రవరం లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌లను భారీ మెజారిటీతో గెలిపించాలని ఏడుకొండలు కోరారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు తోట సుబ్రహ్మణ్యం, కె. వెంకటరమణ, సింహాచలం, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల ప్రలోభాల్లో టీడీపీ బిజీ

తాళ్లపూడి: టీడీపీ నాయకులు ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడం ప్రారంభించారు. మండలంలో టీడీపీకి పట్టు లేకపోవడంతో వారు ఓటర్లకు తాయిలాల ఎర చూపుతున్నారు. ఓటుకు రూ.2 వేల చొప్పున నగదు పంపిణీ చేస్తున్నారు. నగదు పంపిణీ అందరికీ కాకుండా కొందరికే చేయడంతో ఓటర్లు టీడీపీపై గుర్రుగా ఉన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ జనసేన నాయకులకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని కొందరు కూటమిపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకూ తమను ప్రచారంలో వాడుకుని తీరా నగదు పంపిణీలో పక్కన పెట్టారని వాపోతున్నారు. ప్రధానంగా వేగేశ్వరపురంలో ఈ పరిస్థితి నెలకొంది. ఈ గ్రామంలో జనసేన పార్టీ తరఫున సర్పంచ్‌గా పోటీ చేసిన నేత వర్గం ఇప్పుడు టీడీపీ కూటమికి దూరంగా ఉన్నారు.

16న జామాయిల్ చెట్ల వేలం

కొవ్వూరు: పట్టణంలోని ఆర్టీసీ డిపో ప్రాంగణంలో ఉన్న జామాయిల్ చెట్లకు ఈ నెల 16న వేలం నిర్వహించనున్నట్టు డిపో మేనేజర్ వైవీవీఎన్ కుమార్ తెలిపారు. ఆసక్తి కలిగిన వారు మధ్యాహ్నం మూడు గంటలకు డిపో ఆవరణలో నిర్వహించే వేలంలో పాల్గొనాలని ఆయన సూచించారు.

హైదరాబాద్ నుంచి ప్రత్యేక బస్సులు

కొవ్వూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈనెల 11, 12 తేదీల్లో హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం, కొవ్వూరు బస్ డిపోలకు ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతున్నామని ఆర్టీసీ కొవ్వూరు డిపో మేనేజర్ వైవీవీఎస్ కుమార్ తెలిపారు. మళ్లీ 13, 14 తేదీల్లో కూడా తిరుగు ప్రయాణాలకు ఇబ్బంది లేకుండా ఈ ప్రత్యేక సర్వీసులను హైదరాబాద్‌కు నడుపుతున్నామని చెప్పారు.

16 మద్యం బాటిళ్లతో ఒకరి అరెస్టు

నిడదవోలు రూరల్: సమిశ్రగూడెం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న అదే గ్రామానికి చెందిన ఎస్.వెంకట్రావును అరెస్ట్ చేసినట్టు ఎస్ఈబీ నిడదవోలు సీఐ కె.వీరబ్రహ్మం శనివారం తెలిపారు. అతడి వద్ద నుంచి 16 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ దాడుల్లో ఎస్సై ఆర్.దొరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ష్.. గప్‌చుప్

- ముగిసిన ఎన్నికల ప్రచార పర్వం
- మూగబోయిన మైకులు, విశ్రాంతి తీసుకుంటున్న వాహనాలు
- ప్రచారంలో వైఎస్సార్ సీపీదే పైచేయి
- చివరి రోజున పట్టణం, మండలంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి శ్రీనివాస్‌నాయుడి విస్తృత ప్రచారం

నిడదవోలు: పల్లె, పట్టణం అనే తేడా లేకుండా దాదాపు నెల రోజులుగా హోరెత్తించిన మైకులు మోగబోయాయి. మండుటెండల్లో అలుపెరగకుండా రోడ్లపై ప్రయాణించిన ప్రచార వాహనాలు విశ్రాంతి తీసుకుంటున్నాయి. గొంతు చించుకుంటూ, స్వేదం చిందించిన వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలకు ఒకింత విరామం దొరికింది. సార్వత్రిక ఎన్నికల ప్రచార ఘట్టం శనివారం సాయంత్రం ఆరు గంటలతో ముగిసింది. పోలింగ్‌కు ముందు నిశ్శబ్ద, ఉత్కంఠ వాతావరణం నెలకొంది.

పట్టణంలో శ్రీనివాస్‌నాయుడు

సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి పూర్తి మెజారిటీతో తనను గెలిపించాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్‌నాయుడు ప్రజలను అభ్యర్థించారు. మరోసారి అవకాశం ఇస్తే, తన జీవితాన్ని ప్రజల సేవకే అంకిత మిస్తానని, నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. శనివారం ఆయన పట్టణంలో ప్రచారం నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి నాయకులు, కార్యకర్తల బైక్ ర్యాలీతో ప్రచారం ప్రారంభమైంది. అన్ని వార్డుల్లో ప్రచారం ముమ్మరంగా సాగింది. ఆయా కౌన్సిలర్ల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మహిళలు ప్రచారంలో పాల్గొన్నారు. మహిళలు హారతులు పట్టి శ్రీనివాస్‌నాయుడికి విజయ తిలకం దిద్దారు. ప్రచార రథంపై మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, పార్టీ పట్టణశాఖ అధ్యక్షుడు ముంగండి కృపానందం, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, కౌన్సిలర్లతో కలిసి ప్రజలకు అభివాదం చేసుకుంటూ శ్రీనివాస్‌నాయుడు ముందుకు సాగారు. సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, అభివృద్ధికి అడుగులు పడాలన్నా ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి గెలిపించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు.

ప్రజా ఆశీస్సులతో నా విజయం ఖాయం..

నిడదవోలు రూరల్: తాను చేసిన అభివృద్ధి పనులు కళ్ల ముందే కనిపిస్తున్నందున అందరి ఆశీస్సులతో తాను మరోమారు ఎమ్మెల్యేగా గెలవడం ఖాయమని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జి. శ్రీనివాస్‌నాయుడు ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని పురుషోత్తపల్లి, పందలపర్రు గ్రామాల్లో శనివారం ఆయన విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశారు.



పురుషోత్తపల్లి ప్రచారంలో ఓట్లు అభ్యర్థిస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్‌నాయుడు

ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్‌నాయుడికి రెండు గ్రామాల్లోనూ పార్టీ శ్రేణులు, ప్రజలు ఘన స్వాగతం పలికి హారతులు పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిడదవోలు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తూనే ప్రజలకు స్వచ్ఛమైన పాలన అందించానన్నారు. సంక్షేమ పథకాల కేటాయింపులో ప్రత్యర్థులకు సైతం వివక్ష చూపలేదని, అధికార దర్పం ప్రదర్శించలేదని ఆయనన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనలో కుల,మత, వర్గ భేదాలు లేకుండా అర్హులకు సంక్షేమ పథకాలు అందించి, ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేశానని చెప్పారు. సంక్షేమ రాజ్యం కొనసాగాలంటే ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్‌కు, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచారంలో వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కాలాబత్తుల సుజాత, పార్టీ రాష్ట్ర నాయకుడు ముళ్లపూడి శ్రీనివాసకుమార్ చౌదరి, సర్పంచులు పులుమంతుల నాగదుర్గ, నేలపూడి నాగమణి, సొసైటీ అధ్యక్షులు సుంకవల్లి శ్రీహరి, శీలంశెట్టి సూర్యనారాయణ, పార్టీ నాయకులు ముళ్లపూడి సుబ్బారావు, దుగ్గిన విష్ణు, పులుమంతుల రామారావు, కె.సూర్యప్రకాష్, శ్రీరాములు గంగరాజు, బేతిన ప్రసాద్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నిడదవోలు పట్టణంలో శ్రీనివాస్‌నాయుడి ప్రచారంలో మోటార్ సైకిళ్ల ర్యాలీ

వేగి లింగేశ్వరునికి మంత్రి వనిత పూజలు



అనంతపల్లి మదన గోపాలస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న హోం మంత్రి తానేటి వనిత

నల్లజర్ల: మండలంలోని అనంతపల్లి గ్రామంలో కొలువైన బాలా త్రిపురసుందరీ సమేత వేగి లింగేశ్వరస్వామి ఆలయంలో వైఎస్సార్ సీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి, హోం మంత్రి తానేటి వనిత శనివారం ఉదయం పూజలు చేశారు. స్వామివారికి తొలుత ఆమె ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. తర్వాత మదన గోపాల స్వామిని దర్శించుకున్నారు. మంత్రి వెంట వైఎస్సార్ సీపీ అనంతపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు జాజుల దుర్గారావు, ఉప సర్పంచ్ కలం సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు యడ్లపల్లి మార్త, బంక అప్పారావు, ప్రత్తి మురళీకృష్ణ,శీనుబాబు, బళ్ల నాని, వీరమళ్ల వెంకటేశ్వరరావు, మద్దిపాటి ప్రసాద్, చెల్లూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నిశ్శబ్దం

దేవరపల్లి: సార్వత్రిక ఎన్నికల ప్రచార పర్వం గోపాలపురం నియోజకవర్గంలో శనివారం సాయంత్రం ఆరు గంటలతో ముగిసింది. దాంతో గ్రామాల్లో నిశ్శబ్దం అలుముకుంది. దాదాపు నెల రోజుల నుంచి డీజే బాక్సులు, తీన్‌మార్ డప్పుల ప్రచారం హోరెత్తిన గ్రామాలు ఒకేసారి మూగబోయాయి. ఎన్నికల ప్రచారం ముగియడంతో పోటీలో ఉన్న అభ్యర్థులు ఇళ్లకు చేరుకున్నారు. రోడ్ షో, ఇంటింట ప్రచార కార్యక్రమాలను నిలుపుదల చేశారు.

మేలు చేసిన జగన్‌కు అండగా నిలవండి



వేములూరు ఎన్నికల ప్రచారంలో ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు
- వేములూరు గ్రామంలో ఎన్నికల ప్రచారం

కొవ్వూరు: సంక్షేమ పథకాల ద్వారా పేదలకు మేలు చేకూరుస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలని ఆ పార్టీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు కోరారు. మండలంలోని వేములూరు గ్రామంలో శనివారం సాయంత్రం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. గ్రామ ప్రధాన వీధుల్లో ప్రచార రథంపై నుంచి వెంకట్రావు తిరుగుతూ గ్రామస్తులకు అభివాదం చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. చంద్రబాబు ఇచ్చే మోసపూరితమైన హామీలను నమ్మి మోసపోవద్దని హితవు పలికారు. యువకులు ఉత్సాహంగా తలారి వెంకట్రావు ప్రచార రథం ముందుగా ర్యాలీగా ముందుకు సాగారు. శ్రీరామా సొసైటీ మాజీ అధ్యక్షుడు కొటికలపూడి అబ్రహం, సర్పంచ్ ఆరేపల్లి శ్రీనివాస్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఎలికే చినవీర్రాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభశెట్టి గంగాధర శ్రీనివాస్ తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.

డమ్మీ పోలింగ్ సామగ్రితో ప్రచారం

గోపాలపురం: మండలంలోని వివిధ గ్రామాల్లో వైఎస్సార్ సీపీ శ్రేణులు శనివారం డమ్మీ వీవీ ప్యాడ్లు, ఈవీఎంలతో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. రెండు ఓట్లనూ ఫ్యాన్ గుర్తుకు వేసి, తమ పార్టీ గోపాలపురం అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ తానేటి వనిత, రాజమహేంద్రవరం లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌లను అఖండ మెజారిటీతో గెలిపించాలంటూ ఓటర్లను అభ్యర్థించారు. రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, పార్టీ మండల కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు, మహిళా కన్వీనర్ యండపల్లి కవిత, నాయకులు కూసం రామమోహన్‌రెడ్డి, వెలగా శ్రీరామమూర్తి, ఎస్కే వల్లీ, ముల్లంగి శ్యామ్‌సుందర్‌రెడ్డి, శాప్ డైరెక్టర్ కప్పల వరలక్ష్మి తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.



డమ్మీ వీవీ ప్యాడ్స్, బ్యాలెట్‌లతో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తలారికి మద్దతుగా కుమార్తె ప్రచారం



చాగల్లు మండలం చంద్రవరంలో తలారికి మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న కుమార్తె శాలిని



తాళ్లపూడి మండలం పెద్దేవంలో ప్రచారం చేస్తున్న అధ్యక్షుడు తోట రామకృష్ణ, నాయకులు

చాగల్లు: వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు మద్దతుగా మండలంలోని పలు గ్రామాల్లో శనివారం భారీ ఎత్తున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చంద్రవరం గ్రామంలో ఆ పార్టీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు కుమార్తె శాలిని ఎన్నికల ప్రచారం చేశారు. అందరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తన తండ్రిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆమె ఓటర్లను విజ్ఞప్తి చేశారు. తీన్మార్ డప్పు వాయిద్యాలు, బాణసంచా కాల్పులతో గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తించారు. చంద్రవరం సర్పంచ్ మద్దిపాటి శ్రీరామమూర్తి, జేఎఫ్‌సీ నాయకులు బండి అశోక్ బాబు, ఏల్లే రాంబాబు, మద్దిపాటి కోదండరాం, మద్దిపాటి శ్రీనివాస్, ఏల్లే నాగేశ్వరరావు, బట్టు రాజు నాయకులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని చాగల్లు, బ్రాహ్మణగూడెం, దారవరం, ఊనగట్ల చిక్కాల గ్రామాల్లో ఎన్నికల ప్రచారం ముమ్మరంగా చేశారు.

తాళ్లపూడి మండలంలో..

తాళ్లపూడి: వైఎస్సార్ సీపీ నాయకులు మండలంలోని అన్ని గ్రామాల్లో తమ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు, ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌లను గెలిపించాలని కోరుతూ శనివారం ఇంటింటి ప్రచారం చేశారు. పెద్దేవంలో ఆ పార్టీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు తోట రామకృష్ణ, సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, నాయకులు చింతా వెంకటస్వామి తదితరులు గడప గడపకూ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఓటర్లకు నమూనా బ్యాలెట్ పత్రాలు అందజేశారు. ముఖ్యంగా వేగేశ్వరపురం, తాళ్లపూడి, మలకపల్లి, ప్రక్కిలంక, పైడిమెట్ట, తాడిపూడి, గజ్జరం,అన్నదేవరపేట, తిరుగుడుమెట్ట, బల్లిపాడు, పోచవరం, రావూరుపాడు తదితర గ్రామాల్లో నాయకులు ప్రచారం చేశారు.

యోగా రాజు... మరి లేరు

నిద్రలోనే కన్నుమూసిన దండు సత్యనారాయణ రాజు

కొవ్వూరు: యోగా రాజుగా పేరు గాంచిన దండు సత్యనారాయణరాజు (82) శనివారం తెల్లవారుజామున కొవ్వూరులోని తన స్వగృహంలో మృతి చెందారు. శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో కుమార్తెతో ఫోన్ మాట్లాడి నిద్రపోయినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. తెల్లవారిన తర్వాత లేవలేదని కుటుంబ సభ్యులు చెప్పారు. గుండెపోటు అయి ఉండవచ్చునని భావిస్తున్నారు. ఆయన మృతదేహానికి శనివారం కొవ్వూరులో అంత్యక్రియలు నిర్వహించారు. సత్యనారాయణరాజు మృతికి పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

స్థానిక గోష్పాద క్షేత్రంలో ఆయన పతంజలి యోగ శిక్షణ కేంద్రాన్ని నడుపుతున్నారు. యోగాలో అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తూ గుర్తింపు తెచ్చుకున్నారు. ఎనిమిది పదుల వయసు పైబడినా ఎలాంటి ఆసనమైనా సునాయాసంగా వేస్తూ యోగాలో తనకెవరూ సాటిరారని నిరూపిస్తున్నారు. ఆయన ఇప్పటి వరకూ 21 సార్లు రాష్ట్రస్థాయి, 18 సార్లు జాతీయ స్థాయి, పది సార్లు అంతర్జాతీయ స్థాయి యోగా పోటీల్లో చాంపియన్‌గా నిలిచారు. ఆయన స్వస్థలం తణుకు మండలం దువ్వ. ఆంధ్ర షుగర్స్ కర్మాగారంలో ఉద్యోగ రీత్యా కొవ్వూరు వచ్చిన ఆయన నలభై ఏళ్లుగా ఇక్కడే స్థిరపడ్డారు. 1993 నుంచి ఈయన యోగా శిక్షకుడిగా మారారు.



దండు సత్యనారాయణ రాజు

పోలింగ్ సామగ్రి పంపిణీకి ఏర్పాట్లు

గోపాలపురం రిటర్నింగ్ అధికారి శివజ్యోతి



దేవరపల్లి: ఈ నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు గోపాలపురం నియోజకవర్గంలో ఏర్పాట్లు పూర్తయినట్టు రిటర్నింగ్ అధికారి కేఎల్ శివజ్యోతి శనివారం విలేకరులకు తెలిపారు. నియోజకవర్గంలో 2,42,763 మంది ఓటర్లు ఉండగా, వారి కోసం 248 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఆదివారం ఉదయం ఏడు గంటల నుంచి గోపాలపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల ఆశ్రమ పాఠశాల ఆవరణలో పోలింగ్ అధికారులు, సిబ్బందికి ఈవీఎంలు, పోలింగ్ సామగ్రి అందజేస్తామని తెలిపారు. పోలింగ్ సామగ్రి పంపిణీకి పంచాయతీ, రెవెన్యూ శాఖల నుంచి 300 మంది సిబ్బందిని నియమించినట్టు తెలిపారు. 278 మంది పీఓలు, 275 మంది ఏపీఓలు, 1100 మంది ఓపీఓలు, ఎస్ఎఫ్‌టీ, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీలు, 140 మంది రూట్ అధికారులను ఏర్పాటు చేసినట్టు శివజ్యోతి వివరించారు. పోలింగ్ సామగ్రి, సిబ్బంది తరలింపునకు 75 బస్సులను ఏర్పాటు చేశామని చెప్పారు. ఆదివారం సాయంత్రానికి అన్ని పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సామగ్రి తరలించబడుతుందన్నారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహణకు అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు సహకరించాలని ఆమె కోరారు.